క్లుప్తంగా

16 మద్యం సీసాలు సీజ్


సీజ్ చేసిన మద్యంతో ఎస్సై

కంభం: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఓ మహిళ వద్ద అక్రమంగా నిల్వ ఉన్న 16 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు స్థానిక ఎస్సై బి.నరసింహారావు తెలిపారు. తనిఖీలు నిర్వహిస్తుండగా ఓ షాపులో మద్యం విక్రయిస్తున్న మహిళను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

15న కార్తీక పౌర్ణమి మహోత్సవాలు

గిద్దలూరు రూరల్: మండలంలోని కె.ఎస్.పల్లె వద్ద గల బీమలింగేశ్వరస్వామి ఆలయం, ముండ్ల పాడు సమీపంలోని పాపులవీడు క్షేత్రంలో శుక్రవారం కార్తీక పౌర్ణమి మహోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. జ్వాలాతోరణం, అఖండ కోటి దీపోత్సవం, గంగా హారతి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు నాగశంకర్, బాలిరెడ్డి, రామిరెడ్డి పేర్కొన్నారు.

హెచ్ఐవీపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న విజయకుమారి

కంభం: హ్యాండ్సప్ కంప్రెషన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక స్థానిక గౌతమి జూనియర్ కళాశాలలో విద్యార్థులకు హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. ప్రాజెక్టు మేనేజర్ విజయకుమారి మాట్లాడుతూ.. సురక్షితం కాని లైంగిక సంబంధాలు, కలుషితమైన సిరంజీలు, సూదులు, కలుషిత రక్తమార్పిడి ద్వారా హెచ్ఐవి సోకుతుందని వివరించారు. క్షయ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వ్యాధి సోకిన తర్వాత ఇబ్బంది పడే కన్నా, రాకముందే జాగ్రత్తలు తీసుకోవడం ఉత్తమమని చెప్పారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు ఘన వీడ్కోలు



రాజమన్నార్‌ను సన్మానిస్తున్న డాక్టర్ వనజ, వైద్య సిబ్బంది

మార్కాపురం: మార్కాపురం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ నాగరాజమన్నార్ సేవలు మరువలేనివని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ వనజ రత్నకుమారి కొనియాడారు. మార్కాపురం నుంచి నెల్లూరు ఏసీఎస్ఆర్ ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా బదిలీపై వెళ్తున్న రాజమన్నార్‌ను బుధవారం జీజీహెచ్‌లో వైద్యులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యాలయ సూపరింటెండెంట్ రాజశేఖర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చిచ్చర పిడుగులు

- చదువుతో పాటు ఆటల్లోనూ మేటి
- రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటుతున్న చిన్నారులు
- నేడు బాలల దినోత్సవం





మార్కాపురం: ఒక వైపు చదువుకుంటూ మరో వైపు ఉదయం, సాయంత్రం, తీరిక సమయాల్లో వారికి నచ్చిన ఆటలు ఆడుతూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తూ చిన్నవయస్సు లోనే పలువురితో శభాష్ అనిపించుకుంటున్నారు పలువురు చిన్నారులు. మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో చదువుతున్న పలువురు విద్యార్థినీ విద్యార్థులు ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో విజయాలు సాధించి ముందుకు దూసుకువెళ్తున్నారు. చదువుల్లోనే కాక ఆటల్లో కూడా సత్తా చాటుతున్నారు. వీరి ఆటలకు తల్లిదండ్రుల ప్రోత్సాహం కూడా తోడవడంతో రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొంటూ పతకాలు సాధిస్తున్నారు. రన్నింగ్, క్రికెట్, హార్డిల్స్, కరాటే తదితర విభాగాల్లో పలువురు విద్యార్థినీ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

కరాటేలో బ్లాక్ బెల్ట్ మహితారెడ్డి



మార్కాపురం పట్టణానికి చెందిన ఫిజియోథెరపిస్టు డాక్టర్ రఘు కుమార్తె మహితారెడ్డి పెద్దారవీడు కేంద్రియ విద్యాలయంలో 5వ తరగతి చదువుతోంది. గత ఐదేళ్లుగా కరాటే నేర్చుకుంటూ ఇటీవలే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. వచ్చేనెలలో ఢిల్లీలో జరిగే పోటీల్లో పాల్గొననుంది. కరాటేలో బ్లాక్ బెల్ట్ ఫోర్త్ డాన్‌గా నిలిచింది. విశాఖపట్నం, నెల్లూరు, గుంటూరు, ఒంగోలు తదితర పట్టణాలతోపాటు వివిధ రాష్ట్రాల్లో జరిగిన కరాటే పోటీలకు హాజరై విజేతగా నిలిచింది.

జిమ్నాస్టిక్స్‌లో జాతీయ స్థాయికి లక్ష్య..



స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పీ లక్ష్య చదువుతోపాటు ఆటల్లో కూడా రాణిస్తోంది. చెస్, జిమ్నాస్టిక్ పోటీల్లో రాష్ట్ర స్థాయిల్లో విజేతగా నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. కాకినాడ, కర్నూలు తదితర ప్రాంతాల్లో జరిగిన చెస్, జిమ్నాస్టిక్స్ క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచింది. తల్లి డోల శ్యామలాదేవీ బాలికోన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.

అండర్ 17 క్రికెట్ జట్టుకు రాగూర్..



మార్కాపురం పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి బీ రాగూర్, ఇటీవలే అండర్ 17 స్టేట్ క్రికెట్ టీముకు ఎంపికయ్యాడు. గత ఏడాది అండర్ 14 టీములో కూడా ఆడాడు. రన్నింగ్‌లో కూడా రాష్ట్ర స్థాయి క్రీడాకారునిగా రాణిస్తున్నారు. 3కే రన్‌లో మంచి ప్రతిభ కనబరిచాడు. ప్రతిరోజూ స్థానిక ఎస్వీకేపీ కళాశాలలో రన్నింగ్, క్రికెట్ ప్రాక్టీస్ చేస్తూ పాఠశాల సమయానికి వెళుతూ అటు చదువులోనూ, ఆటల్లోనూ తన సత్తా చాటుతున్నాడు.

హార్డిల్స్‌లో స్టేట్‌లెవెల్ ప్లేయర్ చిరంజీవి



హార్డిల్స్ అంటేనే కష్టం. అలాంటిది రాష్ట్ర స్థాయిలో రాణించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన చిరంజీవి స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. రాష్ట్ర స్థాయిలో శ్రీకాకుళంలో నిర్వహించిన పోటీల్లో 4వ స్థానంలో నిలిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వీరితోపాటు వేమ మహేష్, విన్ని జయంత్, మల్లిఖార్జున్, అభి తదితరులు కూడా ఫుట్‌బాల్, హైజంప్, క్రికెట్, రగ్బీ క్రీడల్లో జాతీయ స్థాయి జట్లకు ఎంపికయ్యారు.

చిరువ్యాపారులకు హైకోర్టులో ఊరట

గిద్దలూరు రూరల్: నగర పంచాయతీ పరిధిలోని నంద్యాల–ఒంగోలు జాతీయ రహదారి వెంట గత కొన్నేళ్లుగా దుకాణాలు నిర్వహించుకుంటూ బతుకు దెరువు కొనసాగిస్తున్న చిరువ్యాపారులకు హైకోర్టులో ఊరట లభించినట్లు హైకోర్టు న్యాయవాది తురగా సాయిసూర్య ఒక ప్రకటనలో తెలిపారు. చిరు వ్యాపారస్తులు గత 25 ఏళ్లుగా అక్కడ వ్యాపారాలు కొనసాగిస్తు జీవనం కొనసాగిస్తున్నారు. ఇటీవల వారిని ఖాళీ చేయాలంటూ నగర పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేశారు. దీంతో కొందరు చిరువ్యాపారస్తులు హైకోర్టును ఆశ్రయించారు. నోటీసులు జారీ చేసిన అనంతరం షోకాజ్ నోటీసులు ఇవ్వకుండా ఆక్రమణలు ఎలా తొలగిస్తారంటూ నగర పంచాయతీ అధికారులపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు న్యాయవాది సాయిసూర్య పేర్కొన్నారు. చిరువ్యాపారస్తుల నుంచి వివరణ తీసుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించినట్లు వెల్లడించారు. కాగా హైకోర్టు నిర్ణయాన్ని చిరువ్యాపారస్తులు స్వాగతించారు. రాజకీయ కక్షతోనే తమను రోడ్డున పడేయాలని చూస్తున్నారని చిరువ్యాపారులు ఆరోపించారు.

ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ శ్రీనివాస్, రమేష్‌బాబు తదితరులు

మార్కాపురం: ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉందని, మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ డిసెంబర్ 6 నుంచి 13 వరకు 2024–25 విద్యా సంవత్సరానికిగాను జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్టు అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక సాధనా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు, పోస్టర్ ఆవిష్కరణ అనంతరం పాత్రికేయులతో మాట్లాడారు. ప్రతిభా వంతులైన విద్యార్థులకు రూ.100 కోట్ల మేర మెరిట్ స్కాలర్‌షిప్ అందిస్తున్నామని వెల్లడించారు. ఈ విద్యా సంవత్సరంలో సీఎస్ఈ ఫైనలియర్ విద్యార్థిని బి.లక్ష్మీ శైలజ రూ.58 లక్షల వార్షిక ప్యాకేజీతో గూగుల్ కంపెనీకి ఎంపికైందని చెప్పారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జేవీ షణ్ముక కుమార్, ఏపీ, కర్నాటక యూనివర్సిటీ జోనల్ హెడ్ శివరామకృష్ణ, సాధన కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, డైరెక్టర్లు జీఎల్ రమేష్‌బాబు, యూనివర్సిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

దేవాలయాల నిర్వహణ హిందువులకే అప్పగించాలి


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మార్కాపురం: హిందూ దేవాలయాల నిర్వహణను హిందువులకే అప్పగించాలని ఆర్ఎస్ఎస్ నాయకుడు చంద్రశేఖర్ కోరారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని నెహ్రూ బజారులో శ్రీసాయి కల్యాణ మండపంలో హైందవ శంఖారావం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. మార్కాపురం చుట్టుపక్కల గ్రామాల్లో దేవాలయ ఆస్తులు అన్యాక్రాంతమయ్యాయని ఆరోపించారు. దేవాలయాల్లో పనిచేస్తున్న అన్యమతస్తులను వెంటనే తొలగించాలని కోరారు. దేవాలయ పరిసరాల్లో దుకాణాలను హిందువులకే అప్పగించాలని, గోవధ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు ఇమ్మడిశెట్టి వీరారావు, బీజేపీ ఇన్‌చార్జి కృష్ణారావు, జీవీరెడ్డి, మానవత జిల్లా కన్వీనర్ గుంటక వనజాక్షి, మిరియాల వాసవీ ప్రియ, రామ్‌గోపాల్, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

23న సాగునీటి సంఘాల ఎన్నికలు

పొదిలి రూరల్: పొదిలి మండలంలోని ఐదు సాగునీటి సంఘాలకు ఈ నెల 23వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఇప్పటికే సాగునీటి సంఘాల ఓటర్ల జాబితాలను తహసీల్దార్, మండల పరిషత్ కార్యాలయాలతోపాటు ఎన్నికలు జరిగే పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డులో పెట్టామన్నారు. ఇరిగేషన్ శాఖ ఇచ్చిన సర్వే నంబర్ల ఆధారంగా ఓటర్ల జాబితా రూపొందించామన్నారు. ఇప్పటికే అభ్యంతరాలు స్వీకరించామని, సమస్య పరిష్కారం కాక పోతే ఆర్డీఓ వద్ద అప్పీలు చేసుకోవచ్చని చెప్పారు. మండలంలో జరిగే 5 సాగునీటి సంఘాల్లో రామాపురం చెరువు కింద (సూదనగుంట, తుమ్మగుంట గ్రామాల్లో 448.62 ఎకరాల ఆయకట్టుకు 6 ప్రాదేశికాలు, వర్దన్న మైనర్ ఇరిగేషన్ చెరువు కింద తీగదుర్తిపాడులో 317.44 ఆయకట్టులో 6 టీసీలు, ఉప్పలపాడులోని ముసి ఆయుకట్టు సప్లయ్ కింద ఉప్పలపాడు, తలమళ్ల, ఏలూరు, టి–సల్లూరు, చిలంకూరు గ్రామాల్లో 1197.60 ఎకరాల ఆయకట్టులో 6 టీసీలు, పొదిలి చిన్న చెరువు కింద 238.49 ఎకరాల ఆయకట్టులో 6 టీసీలకుగాను 106 ఎకరాల్లో భూ ఆక్రమణలు జరిగి నిర్మాణాలు ఉన్నందున 3 టీసీల్లో ఓటర్లు లేరు. పొదిలి పెద్ద చెరువు కింద 815.09 ఎకరాల ఆయకట్టులో 6 టీసీలు ఉన్నాయని తెలిపారు.

విత్తన శుద్ధి తప్పనిసరి

రాచర్ల: రబీ సీజన్‌లో పప్పు శనగ వేసే సమయంలో విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయాధికారి షేక్.అబ్దుల్ రఫీక్ సూచించారు. మండలంలోని సత్యవోలు, యడవల్లి గ్రామాల్లో రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువులు వాడితే భూసారం పెరిగి అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. రెండు లేదా మూడేళ్లకు పంట మార్పిడి చేయాలని చెప్పారు.

పొగాకు ప్రత్యామ్నాయ పంటలు పండించాలి

గిద్దలూరు రూరల్: రైతులు పొగాకుకు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని ఏఓ విజయభాస్కర్‌రెడ్డి సూచించారు. మండలంలోని కొత్తపల్లె గ్రామ రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. డిమాండ్ లేకపోతే పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. ఉద్యానవనశాఖ అధికారి విష్ణుప్రియ మాట్లాడుతూ.. కూరగాయల సాగులో అధిక లాభాలు గడించవచ్చని చెప్పారు.

కొనకనమిట్ల: రైతులు వ్యవసాయంలో మెళకువలు పాటించి అధిక దిగుబడి పొందాలని వ్యవసాయాధికారి ప్రసన్న రంగలక్ష్మి సూచించారు. బుధవారం మండలంలోని గరిమినపెంట, కాట్రగుంట, పాతపాడు గ్రామాల్లో రైతులకు పంటల యాజమాన్యం,ఫసల్‌బీమాపై అవగాహన కల్పించారు. మినుము, అలసంద, పత్తి పంటలను పరిశీలించి రైతుకు సూచనలు, సలహాలు అందజేశారు. విత్తనాలు, పురుగు మందులు కొనుగోలు చేసినప్పుడు బిల్లులు జాగ్రత్తగా ఉంచుకోవాలని చెప్పారు. పశువైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 21వ పశుగణన సమయంలో రైతులందరూ తమ పశువుల వివరాలు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, సర్పంచ్ దొంతిరెడ్డి జయమ్మ చినరామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

మార్కాపురం రూరల్: మండలంలోని రామచంద్రాపురం, చెన్నరాయునిపల్లిలో కంది పంటను మార్కాపురం వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ.. కందిలో పూత, పిందె, కాయ దశల్లో పురుగు గూడు చేసుకుని హాని కలిగిస్తుందన్నారు. పురుగు ఉధృతిని నివారించే మార్గాలను వివరించారు. హెచ్ఓ రమేష్, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఖైరూన్‌బీ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

పొదిలి రూరల్: రైతులకు సూక్ష్మసేద్యంకు అవసరమైన డ్రిప్ మరియు స్ప్రింక్లర్లు రాయితీపై అందుబాటులో ఉన్నాయని ఎంఐడీసీ ఎం.ఓబయ్య తెలిపారు. బుధవారం పొదిలి మండలంలోని ఓబులక్కపల్లి, బుచ్చనపాలెంలో రైతులకు అవగాహన కల్పించారు. కందిలో సమగ్ర సస్య రక్షణ చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏవో జైనులాబ్దిన్, వీఏఏలు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ ఏఈ


భూపాల్‌రెడ్డి

మార్కాపురం టౌన్: మార్కాపురం మున్సిపల్ ఏఈగా టి.భూపాల్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పొదిలి నగర పంచాయతీలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన మార్కాపురం మున్సిపల్ ఏఈగా బదిలీపై నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న శంకర్‌నాయక్ పొదిలికి బదిలీ అయ్యారు. భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం


దేశ నాయకులు, రైతుల వేషధారణలో చిన్నారులు

కొనకనమిట్ల: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని గొట్లగట్టు గ్రామంలో సెయింటాన్స్ పాఠశాలలో ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. చాచా నెహ్రూ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు దేశ నాయకులు, రైతుల వేషధారణలతో, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆహూతులను అలరించారు. పాఠశాల హెచ్ఎం నారాయణ రమణమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఐఏఎస్ దానంకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న ఆదిమూలపు సురేష్, కరణం బలరాం

కంభం: సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ తండ్రి, దివంగత రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి.దానం మూడో వర్ధంతిని ఆయన స్వగ్రామమైన కంభం మండలంలోని పెద్దనల్లకాల్వలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, రాజాం ఎమ్మెల్యే కొండ్రుమురళి, గిద్దలూరు, చీరాల మాజీ ఎమ్మెల్యేలు అన్నావెంకటరాంబాబు, కరణం బలరామకృష్ణమూర్తి హాజరై దానం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇంకా పలువురు మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు, అధికారులు పాల్గొని పుష్పాంజలి ఘటించారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ల చైర్మన్లను నియమించాలి



మాట్లాడుతున్న నాగేంద్రం

మార్కాపురం: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు చైర్మన్లను నియమించి జుడీషియల్ పవర్ కల్పించాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రం డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీల కోసం ప్రత్యేకంగా డీఎస్పీలను నియమించాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5 నెలలైనా ఎస్సీ, ఎస్టీ కమిషన్లకు చైర్మన్లను నియమించకపోవడం శోచనీయమన్నారు. దాడులు జరిగినా కూడా కేసులు పెట్టడం లేదని, కేసులు కట్టిన తర్వాత ఎమ్మెల్యేల మాటలు విని ఫాల్స్‌గా సిఫార్సు చేస్తున్నారని ఆరోపించారు. పైగా ఎస్సీ ఎస్టీలపై కౌంటర్ కేసులు పెట్టడం దారుణమైన విషయమన్నారు. గత ప్రభుత్వంలో సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులపై ఇప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు. యర్రగొండపాలెంలో దళిత మహిళ తూమాటి చెన్నమ్మ అనే దళిత మహిళను ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన యువకుడు అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనలో ఎస్సీ, ఎస్టీ యాక్టు ప్రకారం కేసు నమోదు చేయకపోగా, లైంగికదాడి జరగలేదని అప్పటి సీఐ బుకాయించారన్నారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు గంటా సుబ్బారావు, మాల మహానాడు జనుమాల నాగయ్య, శాంతకుమార్, కాకుమాను రవి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా వీఓఏల తొలగింపు

- నిబంధనలకు విరుద్ధంగా ఆరుగురు వీఓఏలపై వేటు
- టీడీపీ నేతలు చెప్పినట్టుగా తలాడిస్తున్న ఏపీఎం, సీసీలు

బేస్తవారిపేట: అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో వీఓఏలను అక్రమంగా తొలగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులనే నెపంతో డ్వాక్రా గ్రామ సంఘం అసిస్టెంట్లపై వేధింపులు మొదలెట్టారు. నిబంధనలకు విరుద్ధంగా వెలుగు సీసీ, ఏపీఎంలు అధికార పార్టీ నాయకులు చెప్పినట్లు చేస్తున్నారు. వీఓఏలను తొలగించాలంటే గ్రామ సమాఖ్య సమావేశం నిర్వహించాలి. అందులో మెజార్టీ గ్రూపు లీడర్లు ఎవరిని ఎన్నుకుంటే వారిని వీఓఏగా నియమించాలి. 20–30 గ్రూపు లీడర్లలో కనీసం 75 శాతం కోరం ఉండాలి. అయితే గ్రామ సమాఖ్య సమావేశాలు పెట్టకుండా, ఎటువంటి తీర్మానం చేయకుండానే వంగపాడులో లీడర్లు కానివారితో సంతకాలు తీసుకున్నారు. ఎంపీ చెరువులో ఇన్సూరెన్స్‌లు, సబ్సిడీ పథకాలు వస్తాయంటూ గ్రూప్ లీడర్లతో సంతకాలు తీసుకుని వీఓఏను అక్రమంగా తొలగించారు. వంగపాడు, ఎంపీ చెరువు, ఖాజీపురం, బసినేపల్లె, పీవీ పురం గ్రామాల్లోని వీఓఏలను కనీస నిబంధనలు పాటించకుండానే తొలగించారు. కొత్తవారిని నియమించుకునే సమయంలో గ్రామ సమాఖ్య మీటింగ్ పెట్టకుండానే నాయకులు ఇచ్చిన పేర్లను ఏపీఎం అడ్డగోలుగా ఆమోదించారు. వంగపాడులో సమావేశం నిర్వహించకుండా గ్రామ సమాఖ్య పాలకవర్గాన్ని ఇష్టారాజ్యంగా మార్చివేశారు. అంగన్‌వాడీ కార్యకర్తకు కమిటీలో చోటు కల్పించారు. ఎంజీఎన్ఆర్ఈజీఎస్‌లో ఆడిట్ సీఆర్‌పీగా ఉన్న ఒకరిని వీఓఏగా నియమించారు. అధికారం ఉంటే ఏమైనా చేస్తామని టీడీపీ నేతలు బరితెగిస్తుండగా.. అధికారులు కూడా అందుకు వంతపాడటం విమర్శలకు తావిస్తోంది.

రైల్వే స్పందన.. బాధితుడికి సాంత్వన

కంభం: రైల్లో ఓ ప్రయాణికుడు పోగొట్టుకున్న బంగారు చైనును జీఆర్పీ పోలీసులు సురక్షితంగా అప్పగించారు. ఈ సంఘటన బుధవారం కంభంలో చోటుచేసుకుంది. వివరాలు.. బొడ్డు శేఖర్ అనే వ్యక్తి మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నుంచి అమరావతి ఎక్స్‌ప్రెస్‌లో కంభం చేరుకున్నాడు. ఇంటికి వెళ్లిన తర్వాత మెడలో ఉన్న 33 గ్రాముల బంగారు చైను కనిపించలేదు. వెంటనే రైల్వే స్టేషన్‌కు వచ్చి నైట్ డ్యూటీలో ఉన్న రైల్వే కానిస్టేబుల్ పి.నరేశ్‌కు విషయం వివరించాడు. దీంతో ఆయన ట్రైన్ బీట్ డ్యూటీలో ఉన్న సూర్య ప్రకాష్, సలీం బాషాను అప్రమత్తం చేశారు. ఎస్–7 బోగీలో శేఖర్ ప్రయాణించిన బెర్త్ వద్ద బంగారు చైను దొరికింది. బుధవారం నంద్యాల జీఆర్పీ ఎస్సై అబ్దుల్ జలీల్ చేతులమీదుగా బాధితుడికి చైను అందజేశారు.

అక్రమంగా గ్రావెల్ తరలింపు

- జేసీబీ, 5 ట్రాక్టర్లు సీజ్

కంభం: మండలంలోని సైదాపురం గ్రామ సమీపంలో కొండ వద్ద అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలిస్తున్న జేసీబీ, 5 ట్రాక్టర్లను బుధవారం కంభం ఎస్సై బి.నరసింహారావు సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. వాహనాలను మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.